క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన బీవీఆర్



వైఎస్ జగన్‌ను కలిసిన బీవీఆర్ చౌదరి

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి శనివారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా పార్టీ కేడర్‌లో ధైర్యాన్ని నింపి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధినేత సూచించినట్లు బీవీఆర్ చౌదరి తెలిపారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని, అప్పటివరకు సంయమనంతో ఉండేలా పార్టీ కేడర్‌ను ఒకే తాటిపై నడిపించాలని వైఎస్ జగన్ చెప్పినట్లు తెలిపారు.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, తోమాలసేవ, ఆరాధన, తీర్థప్రసాద గోష్టి తదితర పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. జోరు వానలో కూడా స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. భక్తులకు దాతలు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఈవో తెలిపారు.

ప్రపంచ చెస్ దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీ హంస చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ చెస్ దినోత్సవం నిర్వహించారు. కోచ్ కన్నా నాగు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చెస్ టోర్నమెంట్‌ను వివేకానంద కాలేజ్ ప్రిన్సిపాల్ ఆర్పీ రాజు ప్రారంభించారు. అండర్–15, అండర్–13, అండర్–11, అండర్–9, అండర్–7 కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ స్థానం తశ్విన్, ద్వితీయ స్థానం రుత్విక్, తృతీయ స్థానం కిరణ్మయి గెలుపొందారు. విజేతలకు ఆర్పీ రాజుచే బహుమతులు అందజేశారు.

విజయదుర్గమ్మకు బోనాల సమర్పణ



విజయదుర్గమ్మకు బోనాలు సమర్పించేందుకు శోభాయాత్రగా వెళుతున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. హోమానికి ఉభయదారులుగా కర్పూరపు కృష్ణారావు దంపతులు వ్యవహరించారు. శనివారం అమ్మవారికి మహిళలు బోనం సమర్పించారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా శోభాయాత్రగా తీసుకువచ్చి విజయదుర్గమ్మకు బోనంలను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం విజయదుర్గమ్మ, పంచభూత మరకత లింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు.

శాకాంబరిగా గంగానమ్మ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ అమ్మవారు శాకాంబరిగా దర్శనమిచ్చింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాడ మాసం కావడంతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు.

అన్నా క్యాంటీన్ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ పునర్నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ పనులకు రూ.29 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి పనులు పూర్తిచేసి క్యాంటీన్ ప్రారంభించనున్నట్లు చెప్పారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ప్రారంభించారు. పీవీఆర్ కార్డియాక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఉచితంగా నిర్వహిస్తున్న గుండె వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముంపు బారిన పొలాలు

- పరిశీలించిన వ్యవసాయ అధికారులు
- రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన

చింతలపూడి: వచ్చే రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ సూచించారు. మండలంలోని చింతలపూడి పెద్ద చెరువు ఆయకట్టు, పాత చింతలపూడి, రేచర్ల, యర్రగుంటపల్లి గ్రామాల్లో వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను జిల్లా రిసోర్స్ సెంటర్ అధికారిణి లలిత సుధ, ఏడీ బి నాగకుమార్, డీఆర్సీ ఏఓ ఉష, ఏఓ మీనాకుమారి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామాల్లో అధిక వర్షాలకు వరి పంట, వరి నారుమళ్లు పాక్షికంగా నీట మునిగాయని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 9,247 ఎకరాల్లో నాట్లు వేయగా వర్షాలకు 805 ఎకరాలు ముంపునకు గురయ్యాయని చెప్పారు. 1,066 ఎకరాల్లో నారుమళ్లు ఉండగా 86 ఎకరాల్లో నారుమళ్లు మంపుబారిన పడినట్లు చెప్పారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడి దశలో ఉన్న వరి పంట విత్తనం చల్లిన 2, 3 రోజుల వయస్సులో ఉన్నప్పుడు మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ దశలో నారుమడిలో నీటిని వీలైనంత త్వరగా తొలగించాలన్నారు. దీనివల్ల విత్తనం కోర గాలి పోసుకుని ఎటువంటి నష్టం జరగదన్నారు. ఒకవేళ నీరు తీసే అవకాశం లేకపోతే మరోసారి విత్తనాలు చల్లుకోవాల్సి వస్తుందని అన్నారు. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి ఉంటే 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగి ఉంటే వెంటనే నీటిని బయటికి తీసివేయాలని చెప్పారు. ఐదు సెంట్ల నారుమడిలో ఒక కిలో యూరియ, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకులు వచ్చి నారు ఊడ్పులకు అనువుగా ఉంటుందని తెలిపారు.

పొంగిపొర్లుతున్న కొండవాగులు

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలకు కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇసుక కాలువ, పేడ్రాల కాలువ, కొవ్వాడ కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రేపల్లెవాడ జంక్షన్, గుంజవరం గ్రామాల మధ్యలో ప్రధాన రోడ్డు మార్గంలో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇసుక కాలువ నీరు కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి వెళుతోంది. అలాగే కొవ్వాడ అధిక జలాలు పట్టిసం ఔట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి చేరుతోంది. రోడ్లపై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో భారీ వర్షాల ప్రభావంతో ముంపునకు గురైన పొలాలను మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాంబాబు రైతులతో కలిసి పరిశీలించారు. కొత్తపట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి, వింజరం, పోలవరం ప్రాంతాల్లో 300 ఎకరాల నారు మడులు, నాట్లు వేసిన పొలాలు 2500 ఎకరాల వరకు వర్షం నీటిలో ముంపునకు గురైనట్లు తెలిపారు. నీరు రెండు రోజుల్లో తగ్గితే ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

వరద నీరు వెళ్లే విధంగా బాటలు వేయాలి

కామవరపుకోట: పంట నష్టం నివారించడానికి వరి నారుమళ్లలో, వరిచేలలో చేరిన వరద నీరు వెళ్లేందుకు వీలుగా బాటలు వేయాలని జిల్లా డీఆర్సీ టీం ఏడీఏ లలితా సుధా అన్నారు. శనివారం మండలంలో నీట మునిగిన వరి పంటలను, నారుమళ్లను ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నారుమళ్లు ఎక్కువ నానకుండా వీలైనంత తొందరగా వరద నీటిని బాటలు వేసి తీసివేయాలి అన్నారు. మండల వ్యవసాయ అధికారి సి.పవన్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 356 ఎకరాలు వరి చేలు, 21 ఎకరాలు వరి నారు మళ్లు నీట మునిగినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ అధికారి ఉష కుమారి, గ్రామాధికారి అనూష రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య చర్యలతో నష్టాన్ని తొలగించవచ్చు

లింగపాలెం: అల్పపీడనం వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు వివిధ దశల్లో ఉన్న పంటలు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో రైతులు యాజమాన్య చర్యలతో నష్టాన్ని తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుత వర్షాలకు ముంపునకు గురైన వరి పంటలను ఆయన పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.



కామవరపుకోట: గుర్రాల చెరువు దిగువన ముంపునకు గురైన వరి చేలను పరిశీలిస్తున్న దృశ్యం



పోలవరం రూరల్: రైతులతో కలిసి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు



చింతలపూడి: ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలిస్తున్న చింతలపూడి సబ్‌డివిజన్ ఏడీ నాగకుమార్



లింపాలెం: రైతుకు సూచనలు అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ముంపు పొలాల పరిశీలన



పంగిడిగూడెంలో పొలాలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేత, సర్పంచ్ వెంకటేశ్వరరావు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలో లక్కవరం, పంగిడిగూడెం గ్రామాల్లో ముంపునకు గురైన వరి నాట్లు వేసిన పొలాలను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి పోశారావు ముంపునకు గురైన పొలాల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. రైతులకు అన్ని విధాల ప్రభుత్వ అండగా ఉంటుందని ఎటువంటి అధైర్యం పడవద్దని ఎమ్మెల్యే అన్నారు. లక్కవరంలో మత్స్యకారులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ స్లీవ జోజి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే పంగిడిగూడెంలో ముంపునకు గురైన పొలాలను వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు పరిశీలించారు. భారీ వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చేలా ఉందని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ఎల్‌ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

పోలవరం రూరల్: కొండ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని సాగునీటి చెరువులు నిండుకుండలా మారాయి. ఎల్‌ఎన్‌డీపేట రిజర్వాయర్‌లో గంట గంటకు నీటిమట్టం పెరుగుతోంది. శనివారం నాటికి రిజర్వాయర్ నీటి మట్టం 88 మీటర్లకు చేరుకుంది. 90.50 ఎఫ్ఆర్ఎల్ కాగా, ఒక గేటును ఎత్తి 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఈఈ కొండలరావు తెలిపారు. ఇంకా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో ఉందన్నారు.

రిజర్వాయర్‌ను పరిశీలించిన డీఎస్పీ

రిజర్వాయర్‌ను డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. నీటిని దిగువకు విడుదల చేయడం వల్ల ఏర్పడే ఇబ్బందులపై ఇంజనీరింగ్ ఏడీ కొండలరావును అడిగి తెలుసుకున్నారు. దిగువన గ్రామాలు ఏమైనా ముంపునకు గురవుతాయా, గట్లు పరిస్థితి ఏమిటి, జనజీవనానికి కలిగే ఇబ్బందులపై ఆరా తీశారు. ఈయన వెంట సీఐ జి.మధుబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఉన్నారు.



పోలవరం రూరల్: ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి ఒక గేటు ద్వారా దిగువకు విడుదల చేస్తున్న నీరు

చెరువులకు జలకళ

చింతలపూడి: అల్ప పీడన ప్రభావంతో చింతలపూడి మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా చెరువుల్లోకి భారీగా నీరు చేరడంతో కొన్ని చెరువులు అలుగులు పడగా మరి కొన్ని అలుగులు పారడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత 10 రోజులుగా అల్ప పీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువుల్లో నీరు చేరింది. మండలంలోని చెరువులు జలకళతో ఉట్టి పడుతున్నాయి. వర్షాలకు వర్షపునీరు, మురుగు నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తోంది. వర్షాలకు రహదారులపై గోతుల్లో నీరు నిలవడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కాలువలను తలపిస్తున్న రహదారులు

ద్వారకాతిరుమల: మండలంలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లోని రహదారులు జలమయమయ్యాయి. అలాగే పలు ప్రధాన రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భీమడోలు నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారి మార్గంలోని పంగిడిగూడెం, గొల్లగూడెం వద్ద రహదారిపై వర్షపు నీరు భారీగా చేరింది. ఐఎస్ రాఘవాపురం, జి.కొత్తపల్లి తదితర గ్రామాల్లోని రహదారులు నీట మునిగాయి. వరి పొలాల్లోకి భారీగా వరదనీరు చేరడంతో అవి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు.

నేలకొరిగిన వృక్షం తొలగింపు

లింగపాలెం: భారీ వర్షాలు, ఈదురుగాలులకు ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డుపై భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎస్సై చెన్నారావు, పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది, స్థానికుల సహకారంతో వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



చింతలపూడి: పట్టణంలో వర్షాలకు రోడ్లపైకి చేరిన వరద నీరు



ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



లింగపాలెం: రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం

24న వాహనాల వేలం

జంగారెడ్డిగూడెం: వివిధ నేరాలలో పట్టుబడిన వాహనాలను ఈ నెల 24వ తేదీన వేలం వేయనున్నట్లు ప్రాంతీయ రవాణా అధికారి మదాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీవో కార్యాలయ ప్రాంగణంలో 24వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. నాలుగు చక్రాల గూడ్స్ వాహనాలు 5, మాక్స్ క్యాబ్స్ 2, ఆటో రిక్షా 1 వేలం వేస్తున్నామని, వేలంలో పాల్గొనదలచిన వారు ధరావతు సొమ్ము రూ.5 వేలు చెల్లించాలన్నారు.

వరద బాధితులకు భోజనం అందజేత



వరద బాధితులకు భోజనం అందజేస్తున్న దృశ్యం

వేలేరుపాడు: వరద బాధితులకు భోజనం అందజేశారు. పెద్దవాగు వరదకు గురైన వేలేరుపాడు మండలంలోని 12 నివాసిత ప్రాంతాల్లోని వరద బాధితులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు శనివారం సాయంత్రం భోజనాన్ని తయారుచేయించి బాధితులకు అందజేశారు.

గిరిజన పాఠశాలలకు సెలవు ప్రకటించాలి

బుట్టాయగూడెం: వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినప్పటికీ గిరిజన పాఠశాలలకు శనివారం సెలవు ప్రకటించకపోవడం బాధాకరమని ఉపాధ్యాయ సంఘ నాయకులు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాలల్లో క్వార్టర్స్ అందుబాటులో లేకపోవడం వల్ల నిబంధనలకు కట్టుబడి 8 కిలోమీటర్ల పరిధిలోనే నివసిస్తున్నారని అన్నారు. స్టడీ అవర్స్ పర్యవేక్షించడానికి ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్‌లు, టర్మ్ డ్యూటీ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాఠశాలలోనే ఉంటున్నారని అన్నారు. వర్షాల వల్ల వాగులు పొంగుతున్నందున మిగిలిన పాఠశాలతోపాటే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు కూడా సెలవు ప్రకటించాలని గిరిజన సంఘ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వర్షాలకు కూలిన వర్జీనియా బ్యారన్

కొయ్యలగూడెం: తుపాను ప్రభావంతో ఏర్పడిన అధిక వర్షాలకు వేదాంతపురం గ్రామంలోని ఓ రైతుకు చెందిన వర్జీనియా పొగాకు బ్యారన్ నేల కూలింది. దీంతో పొగాకు రైతు దండా బత్తుల సత్యనారాయణకు ఆర్థిక నష్టం సంభవించింది. బ్యారన్ క్యూరింగ్ పూర్తి చేసుకోవడంతో ఆ సమయంలో ఎవరూ లేకపోవడం జరిగిందని రైతు తెలిపాడు. కూలిన సమయంలో వ్యవసాయ, రేషన్ క్యూరింగ్ సామగ్రి అందులోనే ఉన్నాయని వాటికి నష్టం కలిగిందని రైతు వాపోయాడు. బోర్డు అధికారులు తనకు న్యాయం చేయాలని రైతు వేడుకుంటున్నాడు.

వేదాంతపురంలో కూలిన వర్జీనియా పొగాకు బ్యారన్ →



రికార్డు ధరకు వర్జీనియా పొగాకు

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు ధర ఆల్‌టైం రికార్డ్ స్థాయికి చేరింది. శనివారం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన కొనుగోళ్లలో కేజీ పొగాకు ధర రూ.399కు చేరింది. ధర రోజురోజుకి పెరుగుతూ ఉండడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాల నేపథ్యంలో రైతుల వద్ద ఉన్న మిగిలిన పొగాకును త్వరగా విక్రయించాలని వేలం నిర్వహణాధికారిణి గ్రేసి మార్గరెట్ సూచించారు. కన్నాపురం క్లస్టర్‌కు చెందిన పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా 508 బేళ్లకు 432 బేళ్ల కొనుగోలు అయ్యాయి. ఇప్పటివరకు సరాసరి రూ.313 ధర లభించింది. మొత్తం 105 రోజులలో 8.50 మిలియన్ల పొగాకును కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు.



కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లు నిర్వహిస్తున్న దృశ్యం

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి, బుట్టాయగూడెంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో 40 మంది విద్యార్థులకు పెన్‌లు, పుస్తకాలు, అట్టలు పంపిణీ చేశారు. దొరమామిడిలో నర్సులకు మాస్కులు పంపిణీ చేశారు. దొరమామిడి, గురుగుమిల్లి గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ ప్రతినిధులు బి.వెంకటరామయ్య, కె.శ్రీనివాసరావు, కాకి వెంకటేశ్వరరావు, గుళ్లపూడి శ్రీనివాసరావు, కాకి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం పీహెచ్‌సీ తనిఖీ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం పీహెచ్‌సీని శనివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, వసతులను పరిశీలించారు. ఆరు బెడ్ల స్థాయిని 30 బెడ్ల స్థాయికి తీసుకువెళ్లడానికి కార్యాచరణ చేపట్టాల్సిందిగా డీఎంహెచ్‌వోను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున, ఆసుపత్రిలో అన్ని వనరులను సిద్ధం చేసుకోవాలన్నారు. వైద్యాధికారిణి ఎస్‌కే తస్లీమా, తోట రవి, చోడిపిండి సుబ్రహ్మణ్యం, జ్యేష్ఠ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

చౌక దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే: ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే చౌక దుకాణాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సాయంత్రం ప్రారంభించారు. వాటర్ ట్యాంక్ రామాలయం వద్ద రైస్ మిల్లు రైస్ మర్చంట్స్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చౌక దుకాణాన్ని వినియోగదారులు ఉపయోగించుకోవాలన్నారు. ఆర్ఐ మణిదివ్య, వీఆర్ఓ రామ్మోహన్, మాటూరు సుధీర్, బొమ్మ బాబు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం

కామవరపుకోట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో తడికలపూడి గ్రామ శివారు ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లె ప్రధాన రహదారి జెర్సీ పార్లర్ సమీపంలో శనివారం ఉదయం భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. ఆ సమయంలో రహదారిలో ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. వృక్షం కూలడంతో కొంత సమయం వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం అధికారులు రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న వృక్షాన్ని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ రహదారి వెంబడి ఇంకా ఎండిపోయిన వృక్షాలు ఉన్నాయని, ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా వాటిని గుర్తించి తొలగించాలని పలువురు కోరుతున్నారు.



తడికలపూడి శివారులో రోడ్డుకు అడ్డంగా పడిన భారీ చెట్టు

పేకాట స్థావరంపై దాడి

కొయ్యలగూడెం: కన్నాపురంలో పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.